## క్లుప్తంగా

### దివ్యాంగులను ఆదరించాలి



ఇబ్రహీంపట్నం: సమాజంలో దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకల్లో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రేమ్‌నికేతన్‌లో దివ్యాంగులతో కేక్ కట్ చేయించారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు మందా నాగమల్లేశ్వరరావు, మహిళా నాయకురాలు ఉషా పాల్గొన్నారు.

### చందనాలంకరణలో వేణుగోపాలస్వామి



నెమలి(గంపలగూడెం): వైశాఖ మాసం ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా నెమలి వేణుగోపాలస్వామికి సోమవారం చందనంతో విశేష అలంకరణ చేశారు. వైశాఖ మాసంలో స్వామికి ఉష్ణతాపం నుంచి ఉపశమనం కోసం చందనాలంకరణ చేస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, కుంభగిరి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

### మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేయాలి

నూజివీడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేయడానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ లక్ష్యం రూ.2.35 కోట్లు కాగా లక్ష్యాన్ని మించి రూ.3.03 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడంతో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ జేడీ నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. దీనిని సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా సెక్రటరీ మహాలక్ష్మి అందుకున్నారు. మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాము, శివ పాల్గొన్నారు.

### ఐడీలను ఆధార్‌కు లింక్ చేసుకోవాలి

మైలవరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం జీఓ ఎంఎస్ నంబర్ 7 ఫైనాన్స్(బడ్జెట్–2) విభాగం ప్రకారం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్లు విధిగా తమ సీఎఫ్ఎంఎస్ ఐడీలను వారి ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నంబర్లకు అనుసంధానం చేయవలసి ఉంటుందని మైలవరం ఉప ఖజానాధికారి నెల్లూరి నాగ సత్యనారాయణ సోమవారం తెలిపారు. సీఎఫ్ఎంఎస్, హెర్బ్ పే రోల్స్‌కు సంబంధిత సేవలను పొందాలంటే ఈ అనుసంధానం అత్యవసరమన్నారు. ఈ సౌలభ్యం కోసం మైలవరం ఖజానా కార్యాలయ సిబ్బంది, ఉప ఖజానా పరిధిలోని మూడు మండలాల హెడ్ క్వార్టర్లలో మైలవరం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం, జి. కొండూరు, ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### నిబంధనలు పాటించాలి

మైలవరం: మండల పరిధిలోని ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏసీపీ ఎం.రమేష్ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సోమవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మితి మీరిన వేగంతో ప్రయాణం చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడుపరాదన్నారు. అంతేగాక రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. సీఐ మోహనరెడ్డి, రెడ్డిగూడెం ఎస్సై శ్రీను పాల్గొన్నారు.

### 4,934 స్టీల్ గ్లాసుల పంపిణీ

గంపలగూడెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీకి అవసరమైన స్టీల్ గ్లాసులను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్ ఆయా పాఠశాలలకు అవసరమైన స్టీల్ గ్లాసులను అందజేశారు. మండలంలోని 73 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన 4,934 స్టీల్‌గ్లాసులను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిందని, ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. తహసీల్దార్ బాల కృష్ణారెడ్డి, ఎంపీడీఓ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

### బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ రన్నర్‌గా 'హీల్'

ఆగిరిపల్లి: తోటపల్లి హీల్ స్కూల్ విద్యార్థులు విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన అండర్–16 జిల్లాస్థాయి లైఫ్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచినట్లు హీల్ సీఈఓ అజయ్‌కుమార్ తెలిపారు. గత నెల 29న జరిగిన ఈ టోర్నమెంట్‌లో 3–3 విధానంలో హీల్ విద్యార్థినుల బృందం ద్వితీయ స్థానం సాధించిట్లు తెలిపారు. విజేతలను హీల్ కార్య దర్శి లక్ష్మీ, స్కూల్ ప్రిన్సిపల్ సాయిబాబు, పీఈటీ నాగరాజు అభినందించారు.

# ఘనంగా మేడే వేడుకలు



గంపలగూడెం మండలం ఊటుకూరులో జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఉమామహేశ్వరరావు

గంపలగూడెం: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని గంపలగూడెం మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఊటుకూరులో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఆలపాటి ఉమామహేశ్వరరావు ట్రేడ్ యూనియన్ నాయకులు జక్కల కృష్ణా, రహంతుల్లా, రంజిత్, ఉప సర్పంచ్ రాఘవయ్య, నాయకులు మాధవరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

**కార్మికుల హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలు**

మైలవరం: కార్మికుల హక్కుల సాధన కోసం మేడే స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పిల్లి నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద మే డే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడిన కార్మికుల విజయ గీతిక, శ్రమ జీవుల సంఘటిత శక్తికి ప్రతీక మే డే అన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ పాల్గొన్నారు. రైతు బజారులో సీఐటీయూ ఆధ్వర్యంలో ముఠా కార్మికులు నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

**చాట్రాయిలో..**

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం మే డే దినోత్సవాన్ని కార్మిక సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నంపేట గ్రామంలో జై భీమ్ యువసేన సామాజిక చైతన్య వేదిక, కేవీపీఎస్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

**ముసునూరులో..**

ముసునూరు: కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, ప్రపంచ కార్మికులారా ఏకం కండి అంటూ అలనాడు పిలుపునిచ్చిన కార్మికలోకపు ఐక్యతను నేటి కార్మిక సోదరులు ఆచరించి, పాటించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం పలు గ్రామాలలో కార్మిక నాయకులు పతాకాలను ఆవిష్కరించారు. చింతలవల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పతాకావిష్కరణ చేశారు.

**నూజివీడులో..**

నూజివీడు: ఎందరో కార్మికుల త్యాగఫలితం, పోరాటాల వల్లనే నేడు కార్మికులకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకటరామారావు అన్నారు. పట్టణంలోని పెద్దగాంధీబొమ్మ సెంటర్, ఏరియా ఆస్పత్రి, మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం మేడే పతాకాలను ఎగురవేశారు. నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు, చాట్ల పుల్లారావు, అక్కినేని రాజా, రంగు శ్రీనివాసరావు, బోను చంద్రరావు పాల్గొన్నారు.



మైలవరంలో జెండా ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

**సీఐటీయూ ఆధ్వర్యంలో...**

సీఐటీయూ, సీపీఎంల ఆధ్వర్యంలో సోమవారం మేడే వేడుకలను పట్టణంలో నిర్వహించారు. చిన్న గాంధీబొమ్మ సెంటర్, బస్టాండు సెంటర్‌ల వద్ద మేడే పతాకాలను ఎగురవేశారు.

**ఇబ్రహీంపట్నంలో..**

ఇబ్రహీంపట్నం: ప్రపంచ కార్మిక దినోత్సవం వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఐడీఏలో సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ కార్మిక జెండా ఎగుర వేశారు. లేబర్‌కోడ్స్ రద్దుకు కార్మికులు ఐక్యంగా పోరాడాలన్నారు. కొటికలపూడిలో సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ జెండా ఆవిష్కరణ చేవారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్ ఇబ్రహీంపట్నంలో అరుణపతాకం ఎగుర వేశారు.

**రెడ్డిగూడెంలో..**

రెడ్డిగూడెం: మే డే సందర్భంగా రెడ్డిగూడెం మండలం కేంద్రంలో సీఐటీయూ జెండాను కొండపల్లి పరమేశ్వరరావు ఎగురవేశారు. సీపీఎంజెండాను ఉయ్యూరు కృష్ణారెడ్డి పార్టీ కార్యాలయంలో బీ మోహన్‌రెడ్డి ఎగురవేశారు.



చిన్నంపేటలో మేడే వేడుకలో పాల్గొన్న కార్మికులు

**విస్సన్నపేటలో..**

విస్సన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన అనుబంధ సంఘాల జెండా ఆవిష్కరణ అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, నాగరాజు పాల్గొన్నారు.

**ఆగిరిపల్లిలో..**

ఆగిరిపల్లి: మండలంలో మేడే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లిలోని సీపీఎం స్తూపం వద్ద సీపీఎం, సీఐటీయూ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మేడే వేడుకల్లో పాల్గొన్నారు. సీఐటీయూ నాయకులు ఎస్.కోటేశ్వరరావు, జహంగీర్ బాషా, కోటయ్య, చంటి, శివ, నాగరాజు, ఉశొక్కయ్య పాల్గొన్నారు.

## ఓటీఎస్‌తో హక్కులు కల్పిస్తున్న ప్రభుత్వం

**ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు**

నూజివీడు: గృహనిర్మాణ సంస్థ ఆర్థిక సహకారంతో గృహాలు నిర్మించుకున్న పేదలకు వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం ద్వారా ప్రభుత్వం వారందరికీ హక్కులు కల్పిస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని రామన్నగూడెంలో 45 మంది పేదలకు సోమవారం ఓటీఎస్ పట్టాలను ఎమ్మెల్యే ప్రతాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణ సంస్థ వద్ద ఇంటి పత్రాలు తనఖా పెట్టి పక్కా గృహాలు నిర్మించుకోగా వాటి తాలూకా రుణాలు తీర్చక ఇంటి పత్రాలు లేక పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని పాదయాత్రలో పలువురు పేదలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఓటీఎస్ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. రుణం రూ.10 వేల కంటే ఎంత ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు రూ.10 వేలు చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేసి పేదలకు వారి గృహానికి, స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందిస్తోందన్నారు. ఈ పత్రాలను బ్యాంకుల్లో పెట్టి రుణాలు పొందవచ్చని, అవసరమైతే విక్రయించుకోవచ్చని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలోని పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ఆలోచన చేస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులకు ఇప్పుడు ప్రజలు కనిపించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం శ్రీనివాసరావు, నాయకులు మేకల అనిల్, శీలం సత్యన్నారాయణ, పాలడుగుల బుజ్జి, పామర్తి వీరభద్రరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఓటీఎస్ పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

## హెల్పింగ్ హ్యాండ్స్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన చాన్సలర్

నూజివీడు: ట్రిపుల్ ఐటీలోని పేద విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వారిని ఆదుకునేందుకు స్థానిక ట్రిపుల్ ఐటీలో 2009లో విద్యార్థులు ఏర్పాటు చేసిన హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ వెబ్‌సైట్‌ను సోమవారం ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని కలిగి ఉండటం అభినందనీయమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేద విద్యార్థులకు బాసటగా నిలవాలన్నారు. డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో విద్యార్థులను మమేకం చేయడం అవసరమన్నారు. సమాజం, ప్రజల అవసరాలు తదితర అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆచార్య వియన్నారావు, ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు, భానుకిరణ్, పీఆర్వో సురేష్‌బాబు, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సలీంబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు విజయ్‌మిత్రా, లక్ష్మణరావు, సీతాపతిరావు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**స్పందన అర్జీలు పరిష్కరించాలి**

ఆగిరిపల్లి: స్పందన కార్యక్రమంలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. ఆగిరిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను సబ్ కలెక్టర్ స్వీకరించారు. వివిధ సమస్యలపై 14 అర్జీలు ప్రజల నుంచి వచ్చినట్లు తెలిపారు. హౌసింగ్ ఈఈ శ్రీదేవి, తహసీల్దార్ ఉదయభాస్కరరావు, ఎంపీడీఓ వాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**జగనన్న కాలనీల్లో మెరక పనులకు చర్యలు**

ఇబ్రహీంపట్నం: జగనన్న కాలనీల్లో మెరక పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో సోమవారం స్పందనలో ఆమె పాల్గొన్నారు. 25 మంది వివిధ సమస్యలపై అర్జీలు పెట్టుకున్నారు. అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. జగనన్న కాలనీల్లో మెరక పనులు చేపట్టకపోవడంతో అబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంకు ముందుకు రావడం లేదని ఎంపీపీ పాలడుగు జోత్స్న తెలిపారు. మిషన్ వాత్సల్య పథకంలో లోపాలు వివరించి మొక్కజొన్న కొనుగోళ్లు ఆర్బీకేల్లో ప్రారంభించాలన్నారు. తహసీల్దార్ సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**80 శాతం పింఛన్ల పంపిణీ**

తిరువూరు: మండలంలో సోమవారం 80 శాతం పెన్షన్ల పంపిణీ జరిగినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో మొత్తం 6,651 మంది పెన్షనర్లుండగా 5,329 మందికి పింఛను నగదు పంపిణీ చేశామని పేర్కొన్నారు. తిరువూరు నగరపంచాయతీ పరిధిలో 70శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

**ముసునూరులో..**

ముసునూరు: అర్హులందరికీ పింఛన్ల పథకం, పేదలకు మేలు చేస్తుందని ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు ఈదురు గాలులు, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పింఛన్ల పంపిణీని సోమవారం తెల్లవారుజామునే ఆరంభించి, వేగంగా పూర్తి చేశారు. మండలంలో మొత్తం పెన్షన్లు 7,805 కాగా, మధ్యాహ్నం లోపులోనే 87.55 శాతంతో 6,833 పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రాణి తెలిపారు.

**ఈకేవైసీ చేయించుకోవాలి**

నూజివీడు: పట్టణంలోని డివిజనల్ ఉప ఖజానా కార్యాలయం పరిధిలోని ప్రభుత్వ పింఛనుదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సహాయ ఖజానా అధికారి నాగమణి సోమవారం తెలిపారు. తమ కార్యాలయ సిబ్బంది ఈనెల 2న ముసునూరు మండల పరిషత్ కార్యాలయం, 3న ఆగిరిపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలోను, 4న పట్టణంలోని డివిజనల్ ఉప ఖజానా కార్యాలయం వద్ద ఈకేవైసీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

**విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు**

తిరువూరు: స్థానిక ఐడియాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వేసవి సృజనాత్మక శిక్షణ శిబిరం ఏర్పాటుచేశారు. నగరపంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి ఈ శిక్షణను ప్రారంభించారు. ఆటపాటలు, బొమ్మల తయారీపై 10 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య**

గంపలగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవికాలంలో చేపట్టిన కార్యక్రమాల విజయవంతానికి ఉపాధ్యాయులు సక్రమంగా పనిచేయాల్సి ఉందని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. గంపలగూడెం ఎంఆర్సీలో సోమవారం మండల పరిధిలోని 73 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉయ్ లవ్ రీడింగ్ ద్వారా విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తి, దస్తూరి అందగా ఉండే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ మాట్లాడుతూ వేసవిలో ప్రభుత్వం నిర్దేశించిన అంశాల అమలుపై ఉన్నతాధికారుల బృందం తనిఖీలు చేపడుతుందన్న విషయం ఉపాధ్యాయులు గుర్తుంచుకోవాలన్నారు. కాగా సమీక్ష సమావేశానికి 50శాతం హెచ్ఎంలు గైర్హాజరవడంపై ఎంఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేస్తామని పేర్కొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

**ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు**

నూజివీడు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని రామన్నగూడెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కూడా ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను ఆపకుండా అమలు చేసి రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు రాని పేదలకు పథకాలు వచ్చేలా చేస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం జన్మభూమి కమిటీలు డబ్బులు వసూలు చేసిన తరువాతే పథకాలు అందేవన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం శ్రీనివాసరావు, నాయకులు మేకల అనిల్, కాశేశ్వరరావు, సత్యనారాయణ, బుజ్జి, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

## అకాల వర్షానికి తడిసిన మొక్కజొన్న పంట

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొటికలపూడి, దాములూరు, కాచవరం, చిలుకూరు, మూలపాడు, జూపూడిలో సోమవారం అకాల వర్షానికి మొక్కజొన్న పంట తడిసింది. మండలంలో నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా రెండు వేల ఎకరాల్లో పంటను రైతులు అమ్ముకున్నారు. మిగిలిన రెండు వేల ఎకరాల్లో సుమారు 80 టన్నులు పంట కల్లాల్లో ఆరబెట్టి ఉంది. వర్షానికి కొంతమేర తడిసినట్లు రైతులు తెలిపారు. మొక్కజొన్న రైతులు ప్రేమ ధార రైతు ఉత్పత్తుల పరస్పర సహకారం సంఘం సభ్యులుగా ఉన్నందున ఆ సంఘం పాలకవర్గం సభ్యులు జమలయ్య, కోటయ్య, హనుమంతరావు, నాగేశ్వరరావు ఏఏఓ కిరణ్మయితో కలసి కల్లాలో తడిసిన మొక్కజొన్న పంట పరిశీలించారు.

**భారీ వర్షం**

చాట్రాయి: మండలంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం తడిసిపోయాయి. స్వల్పంగా మామిడి కాయలు రాలాయి. కొత్తగూడెంలో గాలివాన బీభత్సానికి ఆరు విద్యుత్ స్తంభాలు విరిగాయి. వీటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు.

**రైతులు అప్రమతంగా ఉండాలి**

చాట్రాయి: అకాల వర్షాలకు పంటలను కాపాడుకోవడానికి రైతులు అప్రమతంగా ఉండాలని తహసీల్దార్ విశ్వనాథరావు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో తడిసిన పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పంట నష్టం వాటిల్లలేదని, నిలువ ఉన్న పంటలు, కల్లాల చుట్టూ ఉన్న నీటిని తొలగించుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని రైతు భరోసా కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి బి.శివశంకర్ పాల్గొన్నారు.



కొటికలపూడిలో ఆరబెట్టిన మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏఏఓ కిరణ్మయి, సంఘం సభ్యులు

**పంటల పరిశీలన**

ముసునూరు: మండలంలో అకాల వర్షాలకు తడిసిన, నేలవాలిన మొక్కజొన్న, వరి, మిర్చి పంటలను వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు సోమవారం పరిశీలించారు. మండలంలోని ముసునూరు, వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడులో వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ దాసరి సుధ, ఆర్బీకేల క్షేత్ర స్థాయి సిబ్బంది సోమవారం తడిసిన పంటలను పరిశీలించారు.

**నూజివీడులో..**

నూజివీడు: డివిజన్ పరిధిలో భారీ వర్షపాతం నమోదైంది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం ఎనిమిది గంటల వరకు పడిన వర్షపాతం డివిజన్ మొత్తంలో సగటున 47.7 మి.మీ.గా నమోదైంది.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో ప్రజారంజక పాలన చూసి ఓర్వలేని టీడీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ దహనం చేయడంపై ఆమె మండిపడ్డారు. స్థానిక కార్యాలయం వద్ద సోమవారం టీడీపీ నాయకులు తీరును తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకు తిన్నారన్నారు. మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు మాట్లాడుతూ మాజీ మంత్రిగా దిగజారుడు పనులు చేయవద్దన్నారు. సీఎం బ్యానర్ దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐ పి.శ్రీనుకు ఫిర్యాదు చేశారు. నాయకులు అంకే అంకమోహనరావు, శివారెడ్డి, నల్లమోతు ప్రసన్నబోసు, పాలడుగు దుర్గాప్రసాద్, శరభయ్య, గుంజా శ్రీను పాల్గొన్నారు.



టీడీపీ నాయకుల చర్యలను ఖండిస్తున్న నాయకులు

## అపూర్వ సమ్మేళనం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ పాఠశాలలో 1988–89 బ్యాచ్ టెన్త్‌క్లాస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. 35 ఏళ్ల తర్వాత కలిసి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రాజకీయ, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, ఇతర వృత్తుల్లో స్థిరపడిన వారు గత స్మృతులు నెమరవేసుకున్నారు. పాఠశాలలో తిరిగి గత అనుభవాలు స్మరించుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. అక్కల గాంధీ, బొర్రా క్రాంతి, సీహెచ్ శ్రీనివాసరావు, రవీంద్ర, కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక